# ప్రేమించే ఆడపిల్ల

**లక్ష్మికి** చాలా చిరాకుగా ఉంది. ముక్కలు దిబ్బడేసి తలపగల గొట్టుకుపోతున్నట్లు బాధ. అయినా తప్పదు. మరో అరగంటలో తాను కాలేజీ గేటుదగ్గర కాపలాకత్తెలా మారిపోవాల్సిందే.

"ఈ ప్రేమా ఏల కలిగెను నాలో!" తియ్యగా హృదయం రెక్కలు విప్పినట్లు, పరవశించి పాడుతోంది బాలసరస్వతీదేవి. అంత



తలనొప్పిలోనూ, ఆ గొంతుతో గొంతు కలపాలని మనసు మూలల్లో ఎక్కడో కోరిక. కాని తెములేదు. మరో పదిహేను నిముషాల్లో ఇంట్లోంచి బయట పడాలి. లేకపోతే కాలేజీ తనమీద అలుగుతుంది.

"పోనీ. మీ హెడ్‌కు ఫోన్‌చేసి ఇవ్వాళ రాలేనని చెప్పరాదూ!" అన్నాడు శ్రీధర్. "పోనిస్తూ! ఒకరికి ఫోన్‌చేస్తే మరొకర్ని అడగాలంటారు. ఈ గొడవంతా పడే బదులు పోయిరావడం తేలిక." అన్నది లక్ష్మి.

"కదుమరి! నీ ప్రాణానికి ఆ కాలేజీకీ లంకె. నీ కోసం చెప్పినా వినవు నీ కర్మ!" అని మూతి ముడుచుకున్నాడు.

ఆ మాట నిజమే. ఒకరకంగా చెప్పాలంటే లక్ష్మి తాను చేసే ఉద్యోగాన్ని ప్రేమిస్తుంది.

అధ్యాపక వృత్తి కంటే సుఖమైందేదీ లేదనే ఆవిడ అభిప్రాయం. తన ఇరవై రెండేళ్ళ సర్వీసులో ఎంతమందో పిల్లల్ని భారత పౌరుల్నిగా తయారుచేసింది. అందులో డాక్టర్లు, లాయర్లు, అధ్యాపకులు, గృహిణులు, నిరుద్యోగులు. అందరూ, చెట్టంత ఎత్తున ఎదిగి ఏ బజారులోనో, సినిమాలోనో, రైళ్ళదగ్గరో బస్సుల్లోనో, తమ సంతానంతో సహా ఎదురై 'నమస్కారం మేడమ్' అంటే తనకు గుండె పొంగేది. అందలం ఎక్కి ప్రపంచమంతా ఊరేగినట్లుండేది.

అయితే ఆ విద్యార్థుల్లోనూ, రకాలు లేకపోలేదు. ఎంతో పెద్ద పదవిలో ఉన్నా ఆత్మీయంగా, గౌరవం చూపిస్తూ, పలకరించే వాళ్ళున్నట్లే, ఊళ్ళోనే ఉండి పక్కన కూచుని కూడా చూసీ చూడనట్లు చూపులు తిప్పే వాళ్ళూ కొందరుండేవాళ్ళు— "ఆవిడ మాకు చదువు చెప్పడమేమిటి. ఎక్కడినుండో ఈ గడ్డమీదికి కొట్టుకొచ్చి మా మోచేతి కింద నీళ్ళు తాగే మనిషి!" అని చాటుమాటుగా ఒక అస్వస్థపు మానసిక స్థితిని సంస్కారాన్ని బయట పెట్టుకునే ఒక్కో శాల్తీ కనపడుతుండడం కూడా కద్దు. నిజమే, లక్ష్మి మరో జిల్లా నుండి రాజధానికి చేరింది. ఈ గడ్డమీద ఇరవై యేళ్ళకిందట, కావలసిన సంఖ్యలో, అధ్యాపకులు తయారు కాలేదు. అనాదే భూమీపుత్రుల సిద్ధాంతం పుట్టిఉంటే, యూనివర్సిటీ నడిచేది కాదు. కళాశాలల్లో అధ్యాపకు ఉండేవారు కాదు.

అయినా లక్ష్మికి విద్యార్థులంతా ఒకే రకంగా ఉండేవాళ్ళు. వాళ్ళ రంగుభేదాలూ, కులాల భేదాలూ, వాళ్ళుపుట్టిన మట్టి భేదాలూ, వాళ్ళ అంతస్తుల భేదాలూ, ఆవిడకు గమనంలో ఉండేవి కావు. తెలివైన విద్యార్థీ తెలివిలేని విద్యార్థీ అని ఆవిడకు తెలిసినవి రెండే రకాలు. తెలివైన వాణ్ణిమెచ్చుకుని ఆప్యాయంగా ఉత్సాహం కలిగించినట్లే, తెలివిలేని వాడిమీద మరింత శ్రద్ధచూపించేది. తల్లికి బలహీనపు సంతానం 'మీదే' మనసంతా ఉన్నట్లు, ఆవిడ దృష్టివాళ్ళ మీదే! అటూ ఇటూ కాకుండా బియ్యంలో పలుగు రాళ్ళకు మల్లే మరి కొందరు విద్యార్థులుండేవాళ్ళు. వాళ్ళు చదువు కోవడం అనాగరికమనీ, క్లాసులకు రావడం అవమానమనీ, భావించే బాపతు కట్నాలకోసమో, జల్సాగా కాలం గడపడానికో, కాలేజీల నాశ్రయించే రకం. వాళ్ళు లక్ష్మి మనసులో ఎటువంటి స్థానాన్నీ పొందలేని వాళ్ళు. చేటను అద్దం పట్టుకుని చెరిగితే ఒక్కపక్కకు చేరి వేరయిపోయే రాళ్ళలాగా

వీళ్ళను పరీక్షలు వేరు చేసేవి.

పాఠం చెప్పడంలో ఒక తన్మయత్వం, విద్యార్థుల అంతశ్శక్తిని వెలికి తీయడంలో ఒక తృప్తీ, పొందే లక్ష్మికి, గత మూడేళ్ళుగా ఈ వృత్తి మీదే అనాదరం కలగడం మొదలు పెట్టింది.

ఈ మూడేళ్ళనుండీ, విద్యార్థుల ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేని జబర్దస్తీ వ్యవస్థ ఒకటి, చాపకింద నీళ్ళలాగా వాళ్ళ జీవితమంతా పాకిపోసాగింది. హక్కుల్నీ, అధికారాల్నీ, గురించి గొంతు చించుకునే యువతరం, తమ బాధ్యతల్ని మర్చిపోయారు. "ఏం చదువుతార్రా ! ఎందుకు చదవడం ? ఫస్ట్క్లాసొచ్చినా మనకు ఉద్యోగాలొస్తాయా ! మనం చదవకుండా మార్కులు తెచ్చుకునే మార్గాలాలోచించాలి. ఈ బానిస విద్యావిధానానికి చెప్పుదెబ్బలు తగిలించాలి. పుస్తకాలు మూసేసి చదవండి !" అంటూ నాయకులు, చదువుకునే పిల్లల్ని కూడగట్టుకునే వాళ్ళు- ఒక్కక్షరం ముక్కయినా నేర్చుకోకుండా, జబర్దస్తీగా, అధికారుల ముద్రతో, డిగ్రీలిప్పించుకున్నారు. గౌరవింపదగ్గ అధ్యాపకుల్ని తమ దగ్గరజీతానికున్న బానిసల్లా, చులకనగా, చూడడం నేర్చుకున్నారు. చదువుకోదల్చుకున్న వాళ్ళను కూడా బురదలోకి ఈడ్చుకు పోయారు, మరీ మూడేళ్ళనుండీ ముమ్మరంగా సాగుతున్న ఈ తతంగం లక్ష్మికి చికాకు కలిగిస్తోంది.

పచ్చటి పైరును నాశనం చేసే చీడ పురుగుల్ని ఏం చేస్తున్నారు ! ప్రాణాల్ని కబళించే దుష్టక్రిముల్ని ఏం చేస్తున్నారు ! ఒక దొంగనూ, హంతకుణ్ణీ ఏం చేస్తున్నారు ! ఇక్కడ కూడా ఏమైనా చెయ్యాలి. ఏదైనా చేసితీరాలి ! లక్ష్మి ఒక్కటే ఆవేశ పడేది. కాని ఏం చేస్తుంది ? నిజంగా ఏం చెయ్యగలదు తాను! ఓ పెద్ద యంత్రంలో చిన్న చీలలాంటితాను ! ఇటువంటి చీలలన్నీ సరిగా ఉంటేనేయంత్రం పనిచేసే మాట నిజమే అయినా, ఆ యంత్రాన్ని తిప్పే చక్రధారికీ ఇదే ఆవేశం ఉండాలి. లేకపోతే ఏ చీలా ఎంత మాత్రమూ కదలదు.

ఆ చక్రధారికే ఇటువంటి మనోవేదన ఉండదని ఎవరన గలరు ! తాను నడిపే సంస్థ వాసికెక్కాలని ఏ అధికారికైనా ఉంటుంది. నవ్వుల పాలవుతూ ఉంటే చూస్తూ ఊరుకునే శక్తి ఏ సమర్థుడికీ ఉండదు.

పరీక్షలు కోటగోడల మధ్యరాయించాలి. పోలీసుల నిఘా పెట్టినడిపించాలి. కాపీకొట్టే దారులన్నీ మూసెయ్యాలి. అప్పటికీ తెగించే వాళ్ళెవరైనా ఉంటే ఏ మొహమాటమూ అట్టిపెట్టుకోకుండా బయటికి పంపిం చెయ్యాలి. కళ్ళముందు కనిపించే ఈ మార్గాల నన్నిటినీ ఆయన బేరీజు వేసుకున్నాడు. పరీక్షలు నడిపిస్తున్నాడు.

వెడల్పైన నుదురు. ఎదురుగ్గా మనిషిని చూస్తూకూడా ఎక్కడో వెతుకులాడుతున్నట్లు కదిలే కళ్ళు. బిగించిన పెదాల్లో చిరునవ్వు తొంచక పోయినా స్థిరత్వం పీటపెట్టుకుని, మనిషి పట్టుదలను తెలియ జేసే మొహం. ఎప్పుడూ పువ్వుల మధ్య కదలాడుతున్నట్లు రంగు రంగుల బుష్షర్టులో అమిరే శరీరం. వీ. సీ పొద్దున ఎనిమిది గంటలకల్లా పరీక్షలు జరిగే మహిళా కళాశాలలో హాజరు. ప్రతి అధ్యాపకుడూ, ఆ వేళకల్లా విధిగా అక్కడ ఉండక తప్పడం. లేదు. ఇతర రాష్ట్రాలకు సరదా ప్రయాణాలు పెట్టుకున్న వాళ్ళూ, విదేశయానాలకు సన్నాహాలుచేసుకున్నవాళ్ళూ, ఆచార్యులంతా, ఆగిపోవలసి వచ్చింది. చిన్నా పెద్దా అనే తారతమ్యం లేకుండా అందరూ ఒకటిగా ఈ మహాయుద్ధంలో సైనికులు కావలసివచ్చింది. తన ఉద్యోగాన్ని తిరిగి ప్రేమించడానికి లక్ష్మి కిన్నాళ్ళకు వీలు కలిగింది.! కాని పరీక్షలు మొదలు పెట్టిన దగ్గర్నుంచీ, ఒకటే జలుబు, చీదరపుట్టించే తలనొప్పి తన మీద తనకే విసుగు !

ఆవేళ ఉదయం ఎనిమిది గంటలకే సూర్య కిరణాలు తమ ప్రతాపాన్ని చూపించడం మొదలు పెట్టినయ్. నడీ మే నెల! అసమర్థుడి కోపంలా ఎండ అసహ్యంగా ఉంది. సంవత్సరం పొడుగూతా చదవడం ఎగేసి, విధిలేక పరీక్షకు హాజరైన విద్యార్థికిమల్లే చిరాకు పడుతున్నాడు సూర్యుడు. వాడు లోకంలో గుండెలమీద కుంపటి ।

కాలేజీ గేటు. పోలీసులూ, ప్రొఫెసర్లూ, అందరితోటీ కలగాపులగమై కలకల్లాడుతోంది. బయట విద్యార్థులు ఒక వరుసలో నిల్చుని ఉన్నారు. వాళ్ళ నింకా లోపలికి వదిలేసమయంరాలేదు. తనకు అధికారిచ్చిన ప్రవేశపత్రాన్ని చూపించి లక్ష్మి గేటులోనుంచి లోపలికి నడిచింది. ఒక వేళ తానా ప్రవేశపత్రాన్ని మర్చిపోయివస్తే, "నీ హాల్ టికెట్టేదీ అని గేటుదగ్గరే నిలేస్తారా ?" చిన్నగా నవ్వుకుంటూ రెండో గేటుదగ్గరికొచ్చేసింది. ఆ వేళ పదిన్నరవరకూ తనకక్కడే డ్యూటీ ! పరీక్షకోసం తమ సీట్లో కూచోడానికి ముందు విద్యార్థులు నాలుగైదు ఆడంకుల్ని దాటాలి. "నీకున్న హాల్ టికెట్ సరైందేనా ? పరీక్ష రాస్తానని సంతకంచేసి, డబ్బు కట్టినవిద్యార్థి


Post Box No. 184 Tele Grams: 'Tubewlla' Phone : 7 6 1 3 2

RAMINENI INDUSTRIES
CONVENT STREET : : VIJAYAWADA-1
Branches:
(VISAKHAPATNAM & VUYYURU)
Manufacturers of
TENALI SPECIAL FILTER POINTS
Dealers In
G. I. PipeS, Pipe Fittings & Brass Wire Nettings
Dealers In Electrical Motors & Pumps

నాయని కృష్ణకుమారి

నువ్వూ ఒకటేనా ? కాపీచెయ్యడానికి కాగితాల సహాయం వెంటతీసుకు పోతున్నావా !" అనే రకరకాల సందేహాలు ఈ నాలుగెదుచోట్లా క్షుణ్ణంగా తీర్చబడేవి అందుక ఫలంగా కేవలం తన మెదడు మీద మాత్రమే ఆధారపడి కాగితాలతో కుస్తీ పట్టడానికి విద్యార్థి వీరుడు అసహాయ శూరుడై మిగిలిపోయేవాడు.

రెండో గేటుదగ్గర పరీక్షలు రాయడాని కొచ్చిన ఆడపిల్లల్ని నఖశిఖ పర్యంతమూ తనిఖీచేసి కాపీ కాగితాలు దులిపేసి, లోపలికి పంపించడం ఆవేళ లక్ష్మి డ్యూటీ అందుకోసమే అక్కడొక చిన్న మరుగులాంటిది కట్టారు. ఎలక్షన్లలో ఓటర్లు ముద్రవేసేమరుగులాగే ఉందది.

మగ పిల్లలకీ బెడదలేదు. నడుం చుట్టూ చేతులువేసి కాగితాలు పట్టేయడం, జేబుల్లో చేతులుపెట్టి నిర్దాక్షిణ్యంగా కాపీల పాపాల్ని బయటపడేయడం, ఒంగి కాళ్ళు పట్టుకుంటున్నట్లు కింద నుంచి పైదాకా గొట్టంపాంట్లను తడిమి కాగితాలకోసం వెదకడం, ఈ పనులన్నీ సమర్థవంతంగా నిర్వహింపబడుతున్నయ్.

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలుగదా ! అందులో ఈ కాలపు యువతరం బుద్ధికి పదునెక్కువ. బూట్లలో, మేజోళ్ళలో, కాగితాలు దాచుకునేవాడొకడయితే, చేతి గుడ్డలమీద జిలుగురాతలు రాసుకొచ్చేవాడు మరొకడు, కరెన్సీ కాగితాలమీద ఒకడు అక్షరాలు పులుముకొస్తే, కాలరు మడతల్లో కాపీలుదాచుకొచ్చే వాడింకొకడు.

హిప్పీలా జుట్టు పెంచుకున్న ఓ విద్యార్థిని శోధించడం మొదలుపెట్టారు. ఎక్కడా ఏమీ దొరకలేదు. ఆ అబ్బాయి పొద్దున్నలేచి జుట్టు దువ్వుకున్నట్లులేదు. తలంతా పిచ్చుకగూడులా ఎగుడు దిగుడుగా ఉంది నడి నెత్తిన కొద్దిగా, గోపురంలా, పైకిలేచి ఎత్తుగా ఉంది. ఆ పిల్లవాడి కళ్ళు అమాయకంగా లేవు. కొంటెగాఉన్నయ్. నన్ను పట్టడం మీ తరమా అన్నట్లు ఛాలెంజిచేస్తూ మెరుస్తున్నయ్. అతనే గెల్చేటట్లున్నాడు. ఇంతటి సోదా చేస్తున్న పెద్దమనిషికేం తోచిందో ఏమో చప్పున జుట్టులోకి చెయ్యిపోనిచ్చి, ఇంద్రజాలికుడు బుట్టలో నుంచి పాముల్నితీసినట్టుగా కాగితాలుతీశాడు, అక్కణ్ణుంచీ ఆయన ఒక్క హిప్పీ జుట్టును కూడా, తేలిగ్గా వదిలిపెట్టలేదు.

ఆడ పిల్లల కిన్ని నాజూకులు తెలియవు. ఇంత ప్లాను వెయ్యడంరాదు. దేశాన్ని వెర్రిగాలిలా ఊపేస్తున్న ధిక్కారణోద్యమ ప్రభావం వాళ్ళనింకా వశంచేసుకోలేదు ఇంకా కొంత కట్టుబాట్లకూ, పెద్దలకూ, అణగిమణగి ఉండేస్వభావం వాళ్ళల్లో సజీవంగా ఉంది.

చెకింగ్ మొదలైంది. పది పదిహేనునుంది పిల్లల్లో ఒక్కటీ అరా కాగితాలు తెస్తున్నారు. అడపాదడపా ఒకరో ఇద్దరో, జాకెట్టు మాటు కాగితాల్ని తమంతటతామే తీసి ఇచ్చేస్తున్నారు.

లక్ష్మికి ఈ పనిచెయ్యడంలో మగవాళ్లు పడుతున్నంత కష్టంపడే అవసరం కనిపించలేదు. పని సులువుగానే ఉంది. కాని తలకాయ పగలగొట్టేస్తోంది. తల అటూ ఇటూ కదిపినా, ముందుకువంచినా నెత్తిమీద పెద్దరాయి పడేసినంత బాధ కలుగుతోంది. జనం ప్రవాహంలా వస్తున్నారు. ఊపిరి తీసుకోడానికి కూడా వీలులేనంత పని. ఇంతలో ఒకమ్మాయి తాపీగా, తొందరేమిలేనట్లు, హుందాగా, నడుచుకుంటూవచ్చింది. ఆ అమ్మాయి కళ్ళు చురుగ్గాఉన్నయ్. అమాయకంగా, స్వచ్ఛంగా మెరుస్తూ నిండుగాఉన్నయ్. ముఖం చూడగానే బాగా చదువుకుని పరీక్షకు వచ్చిందన్న భావం కలుగుతోంది. చేతులో హాల్ టికెట్టూ, కలం, తప్ప మరేమిలేదు. కనీసం అందరాడపిల్లలూ తెచ్చుకునే 'హేండ్ బాగ్' కూడాలేదు.

ఈ అమ్మాయిని శోధించడం చాలా సులువు కాపీచేసే బాపతులాగాలేదు. అనుకుంటూ లక్ష్మి అలవాటు ప్రకారం ఆ పిల్ల నడుంచుట్టూ తడిమింది. మెడకిందుగా జాకెట్ మీద తట్టింది.

పెద్ద షాక్ ! చూపులెంతమోసం చెయ్యగలవు ! కాపీకొట్టదు లెమ్మనుకున్న పిల్ల కాగితాలు దాచుకుంది. తన అంచనా తప్పయ్యేసరికి లక్ష్మికి విపరీతంగా కోపం కలగసాగింది. అందుకుతోడు, నాదుగా, ప్రతి నిముషమూ నేనున్నానంటూ సలాయించే తలనొప్పి!

లక్ష్మి గొంతుపెద్దదయింది. కళ్లు విప్పారాయో, ఎర్రగామారాయో. తెలీదు. స్వరంలో కాఠిన్యం నిండుకుంది. "ఏమిటా కాగితాలు ! తియ్ బయటికి !" దాదాపు గర్జించినట్లే అరిచింది. పులిని చూచి గజ గజ వణికే లేడిపిల్లనూ, క్రూర రాక్షసి కోరల్లోచిక్కుకునే ఆడపిల్లనూ, కథల్లో వర్ణించడం లక్ష్మికి తెలుసు. కాని ప్రత్యక్షంగాచూస్తే అప్పుడా అమ్మాయిలాగానే ఉండచ్చనిపించింది. ఆపిల్ల పెదాలు వణుకుతున్నయ్. కంటిపాపల్లో వెగటుగా తోచే స్థిరత్వం కనిపించింది. ముఖం క్షణ క్షణానికీ తెల్లగా పాలిపోసాగింది. ఇంకొక్క క్షణంలో, కళ్ళల్లో నీళ్ళూరి కిందికి రాలడానికి సిద్ధంగాఉన్నయ్.

లక్ష్మి మనస్సులో నాలుగు వేపుల్నుంచీ మెత్తదనం కమ్ముకొస్తోంది. మరీ తానంత దౌర్జన్యం చూపించవలసిందికాదేమో !

"ఎందుకా బాధ పడడం ! కాగితాలు త్వరగా తీసిచ్చేయ్. నిన్ను లోపలికి పంపిస్తాను. నువ్వు పరీక్షరాయొచ్చు"— గొంతులో కొంత మెత్తదనం తెచ్చుకుంటూ అనునయంగా చెప్పింది. ఆ అమ్మాయి గొంతు విప్పింది.

"మేడమ్ ! అవి కాపీ కాగితాలుకావండీ ! నన్ను" నమ్మండి ! నన్ను వదిలిపెట్టండి మేడం ! ఆ స్వరంలో అంతులేని దైన్యం. కావలసినంత అభ్యర్థన.

"ఏవిటీ పిల్ల ! కాపీకాకపోతే తీసి చూపించడానికేం ? అదే నిజమైతే, ఈ దైన్యమంతా ఎందుకు !" లక్ష్మికి ఆశ్చర్యం కలుగుతోంది.

"నాతో ఆటలా ! నువ్వు కాదన్నంత మాత్రాన విడిచిపెడ్తారా ఎవరైనా ? త్వరగా నువ్వే తీసిచ్చెయ్ ! క్విక్ !" అరిచింది. అవ

తల ఆడపిల్లలు జమఅవుతూ, గుడారం బైటకెళ్ళను కదులుతున్నారు. ఒక్క పిల్లమీద ఇన్ని నిముషాలు వ్యర్థంచేస్తే తన పని తాను సక్రమంగా నిర్వహించినట్లా ?

"అయితే నన్ను నమ్మరా మేడం ! అవి కాపీలు కానేకావు. ప్రామిస్ ! మీరే ఒట్టు పెట్టమంటే ఆ ఒట్టు పెడతాను." ఆ అమ్మాయి ఇంకా ప్రాధేయపడుతోంది.

"సరి సరి ! ఒట్లువేసేకాలం కాదిది. ఇక నీతో కూచుంటే అవతల నాకు మాట-అంటూ లక్ష్మి మెరుపులాగా చేతినివిసిరి. ఆ అమ్మాయి ఒంటికి తగలకుండానే, జాకెట్టులో నుండి, రెండు వేళ్ళతో కాగితాన్ని ఇవతలికిలాగింది.

అది కాపీ కాగితంకాదు. ఒక అందమైన అబ్బాయి బొమ్మ. ఎర్రగా పూచిన ముద్ద గులాబీలాంటి ముఖంతో ఎదురుగా ఆ అమ్మాయి. లక్ష్మి మొహంలో ముందు ఆశ్చర్యం తర్వాత ఆకళింపు. ఆ పైన అంతులేని సానుభూతి! సిగ్గుతో పారిపోతున్న ఆ అమ్మాయి కళ్ళ రెప్పల్ని మెచ్చుకుంది లక్ష్మి.

"నీ బాయ్ ఫ్రెండ్ ఫొటోయేనా?" మెల్లిగా అడిగింది. ఆ పిల్ల దగ్గర నుండి ఒక్క తల ఊపు.

"ఈ ఫొటో ఇట్లా దగ్గరగా లేకపోతే నువ్వు పరీక్షలు ఉత్తేజంతో రాయలేవు కాబోలు నేం?"-మరో తల ఊపు! వెంటనే ఉన్నట్లుండి సుడిగాలిచుట్టినట్లుగా ఆ పిల్ల, ఫొటోను దొరికించుకుని, చెంగున బయటకు గెంతింది. లేళ్లు ఎట్లా దూకుతాయో ప్రేమించే ఈ ఆడపిల్ల చూపించింది.

ఆ గందరగోళంలో మనస్సులో ఎక్కడి నుంచో వాల్యూం పెంచిన రేడియో పాటలాగా, పొద్దున్న పాట చెవుల్లో మోగుతోంది. చిత్రం ? అంతవరకూ తన్ను బాధించిన తలనొప్పి ఏమయిందో లక్ష్మికి అంతుపట్టలేదు.

---

● ఓ తెలుగు మాష్టారు తన క్లాసులో అల్లరిచేస్తున్న విద్యార్థులకు చురక తగిలించాలని ఓ విద్యార్థిని ఇలా ప్రశ్నించాడు:

"నా కోడిపుంజు నీ యింటికొచ్చి గుడ్డుపెడితే అది నీదవుతుందా? నాదవుతుందా?"

దానికి విద్యార్థి సమాధానం తిరుగుప్రశ్న రూపంలో "మీరు నవమాసాలు మోసి పిల్లవాడ్ని కంటే వాడు మీ కొడుకా ? నా కొడుకా ?" అంటూ డబాయించాడు ఆ కొంటె కుర్రాడు.

---


రిపబ్లిక్ దేశుభాకాంక్షలు

ఫోన్సు : 77971
77972

# ప్రగతి నికేతన్

## బాలబాలికల కాన్వెంటు స్కూలు

కనకదుర్గా టాకీస్ ఎదురు రోడ్డు
సూర్యారావుపేట: విజయవాడ-2
మారుతీనగర్ బ్రాంచి : విజయవాడ-4

- ఇంగ్లీషు మీడియం నర్సరీనుండి 5వ తరగతి వరకూ
- తెలుగు మీడియం—నర్సరీ 1నుండి 7వరకు రికగ్నైజ్డు తరగతులు
- 1నుండి మెట్రిక్ తరగతి వరకు ఉత్తమ శిక్షణ.
- హాస్టల్ వసతి కలదు—విద్యతోపాటు క్రమశిక్షణ ప్రత్యేకత !
- అడ్మిషన్ పరీక్షలకు అప్లికేషన్ ఫారములు పాఠశాల ఆఫీసులో ఇవ్వబడుచున్నవి.
- ప్రాస్పెక్టస్‌కు, హాస్టల్ నిబంధనలకు వెంటనే వ్రాయండి.

కోటగిరి శీతారామమూర్తి B. A. B. E. D.
హెడ్మాష్టరు

యలమంచిలి చంద్రశేఖర్ ప్రిన్సిపాల్
M. A. B. ED., L. S. G. D.